# నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 324 | పేజీలు: 4 | వెల: రూ.4/- | మంగళవారం 21 జులై 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


# సీజేపీ ఆందోళనలో ఉద్రిక్తత


## పోలీసులు అదుపులోకి అభిజీత్ దీప్కే- కేంద్రంపై ప్రతిపక్షాలు ఫైర్

**దిల్లీ పోలీసుల అదుపులో కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు- కొట్టిపారేసిన దిల్లీ పోలీసులు- కేంద్రంపై విమర్శలు గుప్పిస్తున్న విపక్షాలు**

**న్యూఢిల్లీ, జులై 20 (నమస్తే ఉదయం)**

పరీక్షల సంస్కరణలు, ప్రశ్నాపత్రాల లీకేజీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దిల్లీలో నిర్వహించిన 'సంసద్ చలో' ర్యాలీ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు పార్లమెంటు స్ట్రీట్‌లోకి పెద్ద ఎత్తున సీజేపీ కార్యకర్తలు వచ్చి వర్షంలోనూ వారి ఆందోళన కొనసాగిస్తున్నారు. ఈక్రమంలో వారిపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. పోలీసులపైకి ఆందోళనకారులు వాటర్ బాటిళ్లు, చెప్పులు విసిరారు. తోపులాటలో పోలీసులు, ఆందోళనకారులకు గాయాలయ్యాయి. దీనిపై ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందిస్తున్నాయి.నిరాహార దీక్షను విరమించిన కొద్ది సేపటికే అభిజీత్ దీప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సీజేపీ తెలిపింది. అయితే పోలీసులు మాత్రం అభిజీత్ దీప్కేను అదుపులోకి తీసుకున్నారని వార్తలను దిల్లీ పోలీసులు ఖండించారు. ఆ వార్తలు పూర్తిగా అవాస్తమని తెలిపారు. మరోవైపు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు దారుణంగా దాడి చేస్తున్నారని, విద్యార్థులకు ఎంపీలు మద్దతు ఇవ్వాలని సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ కోరారు. కేంద్రం తమను చర్చలకు ఆహ్వానించిందన్న సౌరవ్ దాస్ కేంద్రమంత్రి నడ్డాతో చర్చల్లో ..మిగతా 2లో





## మూడు డిమాండ్లు నెరవేర్చాల్సిందే..

**లేదంటే నిరసనలు కొనసాగిస్తాం: సీజేపీ**

**న్యూఢిల్లీ, జులై 20 (నమస్తే ఉదయం)**

కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన 'చలో పార్లమెంట్' ఉద్రిక్తంగా మారిన వేళ.. నిరసనలకు నాయకత్వం వహించిన వారితో కేంద్ర మంత్రి జేపీ నడ్డా ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పార్టీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ మంత్రికి వినతి పత్రం అందజేశారు. అందులో మూడు డిమాండ్లను పేర్కొన్నారు. 1. సోనమ్ వాంగ్‌చుక్‌ను వెంటనే విడుదల చేయడం. 2. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా. 3. నీట్ లీక్ వల్ల ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వడం. వీటిని సత్వరం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే నిరసనలు కొనసాగిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తానని నడ్డా హామీ ఇచ్చారని భేటీ అనంతరం సీజేపీ ప్రతినిధులు ఎక్స్ వేదికగా తెలిపారు. నీట్, సహా వివిధ ప్రశ్న పత్రాల లీకేజీలకు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కారణమని సీజేపీ ఆరోపించింది. అయినా, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ..మిగతా 2లో

**ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్..**

# కేంద్రంపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

**ఢిల్లీలో నీట్ విద్యార్థుల ఆందోళనపై పోలీసుల లాఠీఛార్జ్**

**కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి**

**ప్రశ్నిస్తున్న యువతపై దాడులు బీజేపీ భయానికి నిదర్శనమన్న సీఎం**

**కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్**

**విద్యార్థులకు అండగా ఉంటానని స్పష్టం చేసిన రేవంత్**

**హైదరాబాద్, జులై 20 (నమస్తే ఉదయం)**



నీట్-యూజీ 2026 పరీక్ష నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై దేశ రాజధాని ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల చర్యను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న వారిపై లాఠీఛార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో ..మిగతా 2లో

## నేడు, రేపు కొడంగల్‌లో సిఎం పర్యటన

**హైదరాబాద్, జులై 20 (నమస్తే ఉదయం)**

నేటి నుంచి రెండు రోజులపాటు కొడంగల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. ఎడ్యుకేషన్ హబ్ పనుల పరిశీలించి, నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్షించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు దుద్యాల్ మండలం, హకీంపేట గ్రామంలోని ఎడ్యుకేషన్ హబ్ ను పరిశీలించనున్నారు. సాయంత్రం 5 గంటలకు కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించనున్నారు. రాత్రికి కొడంగల్ లోనే బస చేయనున్న ముఖ్యమంత్రి, బుదశారం 10 గంటలకు స్థానిక నాయకులు, సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నట్లు ప్రకటించారు.

## నత్తనడకన సర్ డిజిటైలేషన్

**కేవలం 65 శాతం మాత్రమే పూర్తయినట్లు సమాచారం**

**హైదరాబాద్, జులై 20 (నమస్తే ఉదయం)**



రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియకు సంబంధించిన డిజిటలైజేషన్ నత్తనడకన సాగుతున్నది. మరోవైపు అధికారులేమో 90 శాతం పూ-ర్తయిందంటూ ప్రకటనలు ఇస్తున్నారు. బిఎల్‌వోలు తమ ఇంటికి రాలేదని, తమకు ఫారాలు ఇవ్వలేదని పలుచోట్ల నుంచి వరుస ఫిర్యాదులు అందుతున్నాయి. ఇకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారమ్ ల పంపిణీ దాదాపు పూర్తయినప్పటికీ వాటికి సంబంధించిన ఆన్‌లైన్ ..మిగతా 2లో

# పోచారం శ్రీనివాస్ రెడ్డికి గట్టిగా బుద్ధి చెప్పాలి



**బాన్సువాడలో మళ్లీ గులాబీ జెండా ఎగరాలి**

**ఏ పార్టీలో ఉన్నాడో కూడా తెలియని స్థితిలో పోచారం**

**పార్టీలో చేరిన బాన్సువాడ నేతలకు కెటిఆర్ ఆహ్వానం**

**హైదరాబాద్, జులై 20 (నమస్తే ఉదయం)**

బాన్సువాడలో కుడితిలో పడిన ఎలుకలా పోచారం పరిస్థితి తయారైంది. ఇకపై ఏ ఎన్నికలు వచ్చినా ఆయన ఓడిపోవడం ఖాయం అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎలక్షన్స్ ఎప్పుడు వచ్చినా బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఓడగొట్టడమే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కేటీఆర్ సమక్షంలో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన మోరీల్ శ్రీనివాస్ రావు, పలువురు నాయకులు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ. గతంలో బాన్సువాడలో గులాబీ జెండాను ఎగురవేశాం. పెద్దాయన పోచారంను గెలిపిస్తే పోయి పోయి మునిగిపోయే పడవ కాంగ్రెస్ పార్టీలో చేరిండని ఎద్దేవా చేశారు. ఆయన కాంగ్రెస్‌లో చేరి కుడిదిలో పడ్డ ఎలుకలా గిలగిలా కొట్టుకుంటున్నడు. ఈ సమావేశంలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బాన్సువాడలో మరోసారి గులాబీ జెండా ఎగరేసే సమయం వచ్చిందని ఆయన ..మిగతా 2లో

## త్రిపుర డీజీపీ ఆత్మహత్య!

**న్యూఢిల్లీ, జులై 20 (నమస్తే ఉదయం)**



త్రిపుర డీజీపీ అనురాగ్ ధన్‌ఖడ్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. అగర్తలా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని ఆఫీస్ బాత్రూంలో అపస్మాకర స్థితిలో ఉన్న ఆయన్ను గుర్తించిన సిబ్బంది వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మరణించినట్లు సమాచారం. ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే దీనికి సంబంధించి ..మిగతా 2లో




## సజావుగా పార్లమెంట్ సమావేశాలు సాగాలి

**విక్రమ్ విజయవంతం..యువకుల నైపుణ్యం**

**దేశం అనేక విజయాలను నమోదు చేస్తోంది**

**పార్లమెంట్ ముందు మీడియాతో ప్రధాని మోడీ**

**న్యూఢిల్లీ, జులై 20 (నమస్తే ఉదయం)**

పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ఈ సమావేశాలు నిర్మాణాత్మకంగా జరుగుతాయని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మోడీ మీడియాతో మాట్లాడారు. గత నెల రోజులుగా దేశంలో అనేక పరిణామాలు జరిగాయని వెల్లడించారు. అంతరిక్ష ప్రస్థానంలో నవశకం ప్రారంభమైందని తెలిపారు. స్టార్టప్ కంపెనీ తయారు చేసిన విక్రమ్-1 రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిందని వివరించారు. సోమవారం పార్లమెంట్ దగ్గర మీడియాతో ప్రధాని మాట్లాడారు. భారత అంతరిక్ష ..మిగతా 2లో

## ట్రైనీ ఐపిఎస్ సస్పెండ్

**ట్రైనీ ఐపిఎస్‌ను సస్పెండ్ చేస్తూ.. ఆదేశాలు జారీ**

**ఆత్మతహత్యకు యత్నంచిన ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి**

**హైదరాబాద్,జూలై20 (నమస్తే ఉదయం)**


లైంగిక ఆరోపణల నేపథ్యంలో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి వ్యవహారం ఉత్కంఠగా మారింది. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కేసులో ఊహించని ..మిగతా 2లో



## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు

**ప్లాట్ల కోసం పది వరకు దరఖాస్తుల స్వీకరణ**

**రూ.10 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి.. ఇందిరమ్మ ఇళ్ల బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రులు**



**హైదరాబాద్, జులై 20 (నమస్తే ఉదయం)**

క్యూర్ పరిధిలో ప్లాట్ల కోసం ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మీ సేవ, వాట్సాప్, వెబ్‌సైట్‌లో వీటికోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రూ.10వేల టోకెన్ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డ్రా పద్ధతిలో లబ్దిదారుల ఎంపిక ఉంటుందని ..మిగతా 2లో

## కానిస్టేబుల్‌పై పోక్సో కేసు

**బాలిక పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీస్**

2

# ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వ్యవసాయ సంక్షోభం

## కృష్ణమ్మ గడపకు చేరని వరద, అల్లాడుతున్న ఆయకట్టు రైతాంగం!

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 20(నమస్తే ఉదయిం)**

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా, ఎల్ నినో తీవ్ర ప్రభావం కారణంగా వర్షాలు ముఖం చాటేయడంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఏటా జూన్ ప్రారంభం నుంచే నాగలి పట్టి సాగుకు సన్నద్ధమయ్యే అన్నదాతలు, ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల ఆందోళనలో మునిగిపోయారు. సాధారణంగా ప్రతి ఏటా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు నాలుగు మాసాల పాటు వర్షాలు కురుస్తాయి. ఇందులో 50శాతం మొదటి రెండు నెలల్లోనే కురవాలి. కానీ ఈ ఏడాది వర్షాలు రాక ఆలస్యం కావడంతో జిల్లా జీవనాడి అయిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుండి ఆశించిన స్థాయిలో వరద నీరు రాకపోవడంతో ప్రాజెక్టు పూర్తిగా వెలవెలబోతోంది.

**కాల్వలు ఎడారి.. ఆయకట్టు అగమ్యగోచరం:**

జూరాల ప్రాజెక్టుపై ఆధారపడిన కుడి, ఎడమ కాల్వలకు కృష్ణా జలాలు విడుదల కాకపోవడంతో లక్షలాది ఎకరాల ఆయకట్టు భూములు సాగునీరు లేక బీడువారాయి. నదీ పరివాహక ప్రాంతాల్లో సైతం నీటి జాడ లేకపోవడంతో రైతులు కృష్ణమ్మ నీటి విడుదల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రతి సంవత్సరం ఖరీఫ్ సీజన్ లో ఆయకట్టు రైతాంగం సాగుకు సిద్ధమై, వరి నాళ్లు వేసి వ్యవసాయ పనులో నిమగ్నమయే వారు. కాని ఈ సారి ఆ



జాడ లేదు. ఎటు చూసిన బీళ్లు వారిన పొలాలే కనిపిస్తున్నాయి.

**బోర్లు ఫెయిల్.. అడుగంటిన భూగర్భ జలాలు:**

వర్షాలు లేకపోవడం, కాల్వలు పారకపోవడంతో జిల్లాలో భూగర్భ జలాలు ఊహించని స్థాయిలో పడిపోయాయి. గతంలో నీరు పుష్కలంగా పోసిన బోరుబావులు సైతం ఇప్పుడు పూర్తిగా అడుగంటిపోయాయి. కాల్వల ద్వారా నీరు రాక, బోర్లలో నీళ్లు లేక పంటలు వేయలేక, వేసిన అరకొర పంటలను కాపాడుకోలేక రైతులు తీవ్ర గోస పడుతున్నారు.

**అప్పుల ఊబిలో అన్నదాత -- ఆదుకోవాలన్న డిమాండ్:**

వర్షాలు ఆలస్యం కావడంతో వరి, పత్తి,మొక్కజొన్న, కంది వంటి ప్రధాన పంటల సాగుపై తీవ్ర ప్రభావం పడింది. సాధారణంగా ఈ సమయానికి పచ్చదనంతో కళకళలాడాల్సిన పొలాలు ప్రస్తుతం బీటలు వారుతున్నాయి.



భూగర్భజలాలు పడిపోవడంతో ఎండిపోయిన నారుమళ్లు

బోర్ల కింద సాగు చేసిన పంటలకు సాగు నీరందక

ఎండిపోతుండటంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వ్యవసాయ అధికారులు రైతులు వాతావరణ పరిస్థితులను గమనించి మాత్రమే విత్తనాలు వేయాలని సూచిస్తున్నారు. రానున్న

**రోజుల్లో విస్తృతంగా వర్షాలు కురిస్తేనే ఖరీఫ్ సాగు**

కొంత పుంజుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే, క్షేత్రస్థాయిలో పరిస్థితికిశాశ్వత పరిష్కారం కనిపించడం లేదని రైతులు

వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం వెంటనే స్పందించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం , నీటిపారుదల శాఖ అధికారులు వెంటనే స్పందించి, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని, సంక్షోభంలో ఉన్న రైతాంగానికి గట్టెక్కించాలని కోరుతున్నారు.

# సీజేపీ ఆందోళనలో ఉద్రిక్తత

**మొదటి పేజీ తరువాయి...**

అశుతోష్‌తో కలిసి పాల్గొంటానని తెలిపారు. అయితే చర్చలకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉండగా దిల్లీలో ఆందోళనల మధ్యే సీజేపీ ప్రతినిధులు కేంద్రమంత్రి జేపీ నడ్డాను కలిశారు. జేపీ నడ్డా ఆహ్వానం మేరకే ఆయన్ను కలిశామన్న జబీూ ప్రతిని సౌరవ్ దాస్ తమ డిమాండ్లకు సంబంధించి వినతిపత్రం అందించామని తెలిపారు. నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను తక్షణమే నిర్బంధం నుంచి విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశామన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని, ఆత్మహత్యలు చేసుకున్న నీట్ అభ్యర్థులకు కోటి రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరినట్లు జబీూ ప్రతినిధులు తెలిపారు. ఈ డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వ పెద్దలతో చర్చించేందుకు కొంత సమయం ఇవ్వాలని నడ్డా విజ్ఞప్తి చేశారని వివరించారు. మరోవైపు ఆందోళనలు విరమించి దిల్లీలో సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు సహకరించాలని జబీూ ప్రతినిధులను నడ్డా కోరారు. ఈ మేరకు ఎక్స్‌లో నడ్డా పేర్కొన్నారు.

**మోదీ సర్కార్‌పై ఖర్గే విమర్శలు**

విద్యార్థులపై లాఠీఛార్జ్‌ను ప్రజాస్వామ్యంపై దాడిగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభివర్ణించారు. సమస్యలను చెప్పుకోవడానికి వచ్చిన వారిపై దాడి చేయడం ప్రజాస్వామ్యం అనిపించుకోదని అన్నారు. పార్లమెంటు ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన ఆయన, నీట్ ప్రశ్న పత్రంతో లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు నాశనమయ్యాయని తెలిపారు. అయోధ్యలో విరాళాల చోరీపై ప్రధాని నరేంద్ర మోదీ బాధ్యత వహించాలని డిమాండ్ ఖర్గే డిమాండ్ చేశారు. విద్యా విధానంలో అనేక సమస్యలు ఉన్నాయని ఎంపీ ప్రియాంక గాంధీ అన్నారు. వాటిపై చర్చ జరపకుండా విద్యార్థులపై ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించారు.

కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ కూడా స్పందిస్తూ సీజేపీ నిరసనలపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువతపై లాఠీఛార్జ్ చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. చర్చలకు ప్రభుత్వం నిరాకరించడం వల్లే ఈ ఆందోళనలు, అవాంతరాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో యువత తమ అసంతృప్తిని, కోపాన్ని వ్యక్తం చేయడానికి ఒక వేదిక ఉండాలని, ఆందోళనలను బలప్రయోగంతో అణచివేయడం సరికాదని ఆయన హితవు పలికారు. యువతలో పేరుకుపోయిన నైరాశ్యానికి ఈ ఆందోళనలు అద్దం పడుతున్నాయని చెప్పారు.

**యువత డిమాండ్లు వినాలి : కేజ్రీవాల్**

ఈ ఘటనపై ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. లక్షలాది మంది యువత న్యాయం కోసం వీధుల్లోకి వస్తే వారి మాట వినాల్సిందిపోయి లాఠీచార్జ్‌కు ఆదేశించడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వం అహంకారాన్ని విడిచిపెట్టి యువత డిమాండ్లను వినాలని, ఇంటర్నెట్ సేవలు నిలిపివేయడం, పార్లమెంట్ వైపు వెళ్లకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కూడా నిరసనకారుల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. యువత లేవనెత్తుతున్న అంశాలపై చర్చించి పరిష్కారం చూపాలని సూచించారు.

# ట్రైనీ ఐపిఎస్ సస్పెండ్

**మొదటి పేజీ తరువాయి...**

పరిణామం ఎదురైంది. ఓ వైపు ఆయనను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకోగా,మరోవైపు ఆయన ఆత్మహత్యకు పాల్పడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో హైదరాబాద్ నేషనల్ అకాడమీ చర్యలు తీసుకుంది. కృష్ణారెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. నేషనల్ పోలీస్ అకాడమీ ప్రివిలేజ్ కమిటీ నిర్ణయం మేరకు ఉదయ్ కృష్ణా రెడ్డిని ఎన్‌పీఏ నుంచి అధికారులు పంపించేశారు. ఉదయ్ కృష్ణారెడ్డి ప్రవర్తన గురించి మొదట ఎన్‌పీఏ అధికారులకు మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు చేశారు. సీసీటీవీ కెమెరాల ఆధారాలతో పాటు అన్ని ఆధారాలు సేకరించాక ఉదయ్ కృష్ణారెడ్డిపై ఆరోపణలు నిజమేనని ప్రివిలేజ్ కమిటీ నిర్ధారించింది. దీంతో తక్షణమే పోలీస్ అకాడమీ నుంచి నుంచి సస్పెండ్ చేస్తూ ప్రివిలేజ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. సర్వీస్‌లో జాయినింగ్‌కు సంబంధించి డీవోపీటీ దే తుది నిర్ణయం అని నేషనల్ పోలీస్ అకాడమీ అధికారులు చెబుతున్నారు. ఇదిలావుండగానే ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు యత్నించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆయనను ఆస్పత్రికి తరలించారు. ఎర్రగడ్డలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కృష్ణారెడ్డికి చికిత్స అందిస్తున్నారు. ఆదివారం కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. తనను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడంటూ మరో మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు చేశారు. దీంతో అత్తాపూర్ పోలీసులు కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈ అంశంపై ఎనిమిది రోజుల్లోగా వివరణ ఇవ్వాలంటూ ట్రైనీ ఐపీఎస్‌కు పోలీసులు నోటీసులు కూడా జారీ చేశారు. అయితే ఈ ఘటన అనంతరం సొంతూరుకు వెళ్లిపోయిన కృష్ణారెడ్డి.. ఆదివారం సాయంత్రం మోతీనగర్‌లోని స్నేహితుడి ఇంటికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు యత్నించాడు. ఇది గమనించి అతన్ని ఎర్రగడ్డలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. కాగా, ఆత్మహత్యకు ముందు తన తప్పేమీ లేదని ఉదయ్ కృష్ణారెడ్డి వాట్సాప్ స్టేటస్ పెట్టడం గమనార్హం. తనతోపాటు శిక్షణ పొందుతున్న తోటి ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఈ ఏడాది జూన్ 23 నుంచి తనను లైంగికంగా వేధిస్తున్నాడని, వాట్సాప్ ద్వారా అసభ్యకర మెసేజ్‌లు పంపి బూతులు తిడుతున్నాడని ఓ మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉదయ్ కృష్ణారెడ్డి రహస్యంగా తన వ్యక్తిగత ప్రైవేట్ వీడియోలను చిత్రీకరించి తీవ్రంగా బెదిరిస్తున్నాడని, ఆ వీడియోలను తన భర్తకు పంపి మానసికంగా వేధించడంతోపాటు వాటిని సోషల్ మీడియాలో పెడతానంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

# త్రిపుర డీజీపీ ఆత్మహత్య!

**మొదటి పేజీ తరువాయి...**

ఇంతవరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ ఘటన గురించి తెలియగానే ముఖ్యమంత్రి మాణిక్ సాహా డీజీపీ కార్యాలయానికి వెళ్లారు. అనురాగ్ ధన్‌ఖడ్ 1994 బ్యాచ్‌కు చెందిన త్రిపుర క్యాడెర్ ఐపీఎస్. డీజీపీ మృతిపై ఆసుపత్రి సీనియర్ వైద్యుడు మాట్లాడుతూ.. మధ్యాహ్నం 12 గంటల సమయంలో అపస్మారక స్థితిలో ఉన్న అనురాగ్ ధన్‌ఖడ్‌ను తీసుకొచ్చారని అన్నారు. వెంటనే డ్యూటీలో ఉన్న వైద్యులు పరిశీలించగా.. అప్పటికే పల్స్ పడిపోయిందని చెప్పారు. దాదాపు 48 నిమిషాల పాటు సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయిందన్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే ఎలా మృతిచెందారన్నదానిపై స్పష్టత వస్తుందని చెప్పారు. ఉరివేసుకున్న ఆనవాళ్లేమైనా కనిపించాయా? అని విలేకరులు ప్రశ్నించగా.. నివేదిక వచ్చిన తర్వాతే అన్ని విషయాలు తెలుస్తాయని మాట దాటవేశారు. మరోవైపు డీజీపీ మృతితో సీనియర్ పోలీసు అధికారులంతా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు చేరుకున్నారు. సంఘటన స్థలిలో ఆధారాలను సేకరించి, మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# కానిస్టేబుల్‌పై పోక్సో కేసు

## బాలిక పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీస్

**నల్లగొండ, జూలై 20(నమస్తే ఉదయిం)**

బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడని ఓ పోలీస్ కానిస్టేబుల్‌పై పోక్సో కేసు నమోదైంది. ఈ మేరకు గుర్రంపోడ్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సత్యనారాయణను నల్గొండ వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల సైకిల్‌పై వెళ్తున్న ఓ బాలికను నిందితుడు అడ్డగించి, ఆమెతో అసభ్యంగా వ్యవహరించాడు. అనుచితంగా తాకి వేధించాడు. ఇంటికి వెళ్లాక బాలిక ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పింది. వారు వెంటనే వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఘటనాస్థలిలోని సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. నిందితుడు మాస్క్ ధరించి, పలుచోట్ల తిరిగినట్లుగా గుర్తించారు. సదరు మాస్క్ వ్యక్తి గురించి ఎంక్వైరీ చేయగా.. గుర్రంపోడ్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ అని తెలిసింది. దీంతో అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, నకిరేకల్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో కూడా సత్యనారాయణపై రెండు పోక్సో కేసులు నమోదైనట్లుగా తెలుస్తోంది. స్టేషన్‌కు వచ్చే మహిళల పట్ల కూడా అనుచితంగా ప్రవర్తిస్తాడనే ఆరోపణలు ఉన్నాయి

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు

**మొదటి పేజీ తరువాయి...**

స్పష్టం చేశారు. డ్రాలో ఇల్లు రానివారి డబ్బులు వెంటనే చెల్లిస్తామని వెల్లడించారు. ఆయా ప్లాట్లు పదేళ్ల పాటు అమ్మరాదని.. అద్దెకు ఇవ్వరాదని షరతును విధిస్తామని అన్నారు. కుటుంబంలో ఒకరికి ఇళ్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇల్లు, స్థలం లేనివారికి తొలివిడతలో ప్రాధాన్యం కల్పిస్తామని మంత్రి చెప్పుకొచ్చారు. లబ్ధిదారుల పేరిట స్థలం రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. స్థలంతో పాటు రూ.5లక్షల సబ్సిడీ అందజేస్తామని పేర్కొన్నారు. సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వాట్సాప్ దరఖాస్తులు, ఇళ్ల బ్రోచర్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. వారికి స్థలం ఇవ్వడంతో పాటు రూ.5లక్షల సహాయం అందజేస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. పదేళ్ల వరకు ఇళ్లు అమ్ముకునే అవకాశం లేదని చెప్పుకొచ్చారు. మొదటి దశలో 16నియోజకవర్గాల్లో ఇస్తున్నామని.. త్వరలోనే మిగిలిన నియోజకవర్గాల్లో కూడా ఇళ్లు ఇస్తామని స్పష్టం చేశారు. ఆయా పార్టీలు, రాజకీయాలకు సంబంధం లేకుండా ఇళ్లను కేటాయిస్తామనిపేర్కొన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్లు పూర్తి అవుతున్నాయని ఇప్పటికే రెండు విడతల్లో ఏడు లక్షల ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సొంత స్థలాలు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు అందజేశామని వెల్లడించారు. ఇంటి స్థలంలేని పేదలకు కూడా వీటిని అందజేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి వివరించారు. లాభం, స్వార్థం లేకుండా పేదలకు ఇళ్లు నిర్మించి అందజేస్తున్నామని పేర్కొన్నారు. అజఖీఇ పరిధిలో ఇళ్లు కట్టించే పథకాన్ని ఈ రోజు ప్రారంభించామని తెలిపారు. ఇందుకోసం పదహారు నియోజకవర్గాల్లో స్థలాలు ఎంపిక చేశామని చెప్పుకొచ్చారు. 528 అడుగుల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్లాట్లను నిర్మిస్తున్నామని వెల్లడించారు. కేసీఆర్ హయాంలో తప్పిదాలతో అప్పుడు కట్టిన ప్లాట్లు ఉపయోగపడకుండా పోయాయని చెప్పారు. నగరానికి దూరంగా 35 కిలోమీటర్ల దూరంలో కట్టడంతో పేదలు అక్కడకు వెళ్లలేదని తెలిపారు. చదరపు గజానికి లక్షల విలువ ఉండే కోర్ ప్రాంతంలో టవర్లు నిర్మించి పేదలకు ఇస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. పేదలకు ఇళ్లు ఇస్తామంటే కొందరు హేళన చేశారని అన్నారు.

# మూడు డిమాండ్లు నెరవేర్చాల్సిందే..

**మొదటి పేజీ తరువాయి...**

వ్యవహరించిందని, ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆక్షేపించింది. మరోవైపు సీజేపీ ప్రతినిధులతో చర్చలు జరిపినట్లు కేంద్ర మంత్రి నడ్డా కూడా ఎక్స్‌లో పోస్టు చేశారు. స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు జరిగినట్లు చెప్పారు. “ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఇవాళ ఉదయం ఆందోళనకారుల నుంచి తొలిసారి ప్రతిపాదన వచ్చింది. ఉదయం 11: 50 నిమిషాలకు మా చర్చలు ప్రారంభమయ్యాయి. తొలుత మౌఖికంగా చర్చలు జరిపాం. ఆ తర్వాత సాయంత్రం 4 గంటల సమయంలో లిఖిత పూర్వకంగా వినతిపత్రం సమర్పించారు” అని నడ్డా ఎక్స్‌లో పేర్కొన్నారు. నిరసనకారులంతా ఆందోళన విరమించి, పరిస్థితులను సాధారణ స్థాయికి తీసుకొచ్చేందుకు ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, ఆందోళకారులు సంయమనం పాటించాలని దిల్లీ పోలీసులు కోరారు. తప్పుడు సమాచారం, వదంతుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

### ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్..

# కేంద్రంపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

**మొదటి పేజీ తరువాయి...**

విద్యార్థులకు ఆయన తన పూర్తి మద్దతు ప్రకటించారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి, విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు వారి గొంతు నొక్కేందుకు పోలీసు బలగాలను ప్రయోగిస్తోందని ఆరోపించారు. “నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పడిన ప్రతి దెబ్బ.. ప్రశ్నలన్నా, నిజమన్నా బీజేపీకి ఉన్న భయాన్ని బహిర్గతం చేస్తోంది. నీట్ కుంభకోణంపై కేంద్రం ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలి. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను” అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజైన సోమవారం, కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులు ‘ఛలో పార్లమెంట్’ కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లో సమూల సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ వారు పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి.

# పోచారం శ్రీనివాస్ రెడ్డికి గట్టిగా బుద్ధి చెప్పాలి

**మొదటి పేజీ తరువాయి...**

అన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ తరఫున గెలిచి పార్టీ మారారని, ప్రస్తుతం కాంగ్రెస్ పరిస్థితి కూడా బాగోలేదని ఆయనకు అర్థమైందన్నారు. ఈ గొంతులో ప్రాణం ఉన్నంత వరకు పార్టీ మారనని చెప్పిన పోచారం చివరకు మాట తప్పి పార్టీ మారారని ఆరోపించారు. స్పీకర్‌గా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు తాను ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకునే పరిస్థితి కూడా లేదని ఎద్దేవా చేశారు. పోచారం తన రాజకీయ భవిష్యత్తును తానే సమాధి చేసుకున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డిపై కూడా కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయకుండా చేతులెత్తేశారని ఆరోపించారు. దేవుళ్లపై ఒట్టు పెట్టి కూడా అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ఏ సభ పెట్టినా కేసీఆర్‌ను విమర్శించడమే సీఎం పనిగా మారిందన్నారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ అన్నారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, షాపుల్లో ఎరువుల సంచులు లేకపోతే యాప్‌లో కనిపించినా ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ఢిల్లీకి పంపేందుకు సంచులు ఉంటున్నాయని, కానీ రైతులకు మాత్రం అందడం లేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కూడా కేటీఆర్ స్పందించారు. రెండు పిల్లర్లు కుంగి 31 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు మరమ్మతులు ఎందుకు చేపట్టలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కన్నెపల్లి నుంచి ప్రతిరోజూ నీరు కిందకు వెళ్తున్నా పంపింగ్ చేయడం లేదన్నారు. రిజర్వాయర్లు డెడ్ స్టోరేజ్‌కు వెళ్తే ప్రభుత్వం మాత్రం ‘కోల్డ్ స్టోరేజ్‘లోకి వెళ్లిపోయిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ కోసం అవసరమైతే రక్తమే కాదు ప్రాణాలు కూడా ఇస్తామని బీఆర్ఎస్ ఎప్పుడూ చెప్పిందని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలను కూడా ప్రస్తుత ప్రభుత్వం తమ ఘనతగా చెప్పుకుంటోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# సజావుగా పార్లమెంట్ సమావేశాలు సాగాలి

**మొదటి పేజీ తరువాయి...**

ప్రస్థానంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైందని ఉద్ఘాటించారు. భారతదేశ యువత అంతరిక్షంలోకి దూసుకుపోయిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. విక్రమ్-1 విజయం వెనుక యువత పాత్ర కీలకమని తెలిపారు. స్కైరూట్ విజయవంతం అవడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. అదే సమయంలో అంతరిక్ష రంగ స్టార్టప్ స్కైరూట్ 'విక్రమ్-1' ప్రయోగం విజయవంతం అవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. 28 ఏళ్ల సగటు వయసున్న ఆవిష్కర్తలదే ఈ ఘనత అని కొనియాడారు. ‘ఏడాది కాలంలో ఎన్నో గొప్ప విషయాలు జరిగాయి. అంతరిక్షంతో సహా వేదిక ఏదైనా.. మనం సాధించిన విజయాలు దేశానికి గర్వకారణం. గత సంవత్సరం వర్షాకాల సమావేశాలకు ముందు ఒక భారతీయ పౌరుడు శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఇప్పుడు ఒక భారతీయ స్టార్టప్ స్కైరూట్ అద్భుతమైన ఘనత సాధించిందని మోదీ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి పరోక్షంగా చురకలంటించారు. భారత యువత అంతరిక్షంలో ఒక కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మాత్రమే ఇలాంటి ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు 28 ఏళ్లని నాకు తెలిసింది. ఇక్కడ నేను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదని పరోక్షంగా రాహుల్‌ను ఉద్దేశించి మోదీ అన్నారు. యువత సాధించిన ఈ విజయం యాదృచ్ఛికం కాదు. మన దేశ యువత సామర్థ్యం, ఆకాంక్షలు అంతరిక్షం వలే హద్దుల్లేనివని చెప్పే సందేశం ఇదని ప్రధాని ప్రశంసించారు. రాజస్థాన్‌లో అతిపెద్ద ఆయిల్ రిఫైనరీని దేశానికి అంకితం చేశామని వెల్లడించారు. ఒక సెమీ కండక్టర్ ప్లాంట్, గ్రీన్ హైడ్రోజన్ రైలును ప్రారంభించామని తెలిపారు. యుద్ధంతో చాలా దేశాలకు నష్టం జరుగుతోందని చెప్పారు. చమురు ధరలు అమాంతం పెరుగుతు న్నాయని తెలిపారు. 7.7శాతం గ్రోత్‌రేట్ భారత్ నమోదు చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. గందరగోళ పరిస్థితులకు తావులేకుండా పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చలు జరగాలని ఆకాంక్షించారు.

# నత్తనడకన సర్ డిజిటైలేషన్

**హైదరాబాద్, జూలై 20(నమస్తే ఉదయిం)**

రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియకు సంబంధించిన డిజిటలైజేషన్ నత్తనడకన సాగుతున్నది. మరోవైపు అధికారులేమో 90 శాతం పూర్తయిందంటూ ప్రకటనలు ఇస్తున్నారు. బిఎల్‌వోలు తమ ఇంటికి రాలేదని, తమకు ఫారాలు ఇవ్వలేదని పలుచోట్ల నుంచి వరుస ఫిర్యాదులు అందుతున్నాయి. ఇకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారమ్ ల పంపిణీ దాదాపు పూర్తయినప్పటికీ వాటికి సంబంధించిన ఆన్‌లైన్ డాటా ఎంట్రీ పక్రియ మందకొడిగా నడుస్తున్నది. ఆదివారం సాయంత్రం వరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) కార్యాలయానికి అందిన గణాంకాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా 2,19,23, 435 ఈఎఫ్‌ల 64.81 శాతం డిజిటలైజేషన్ పూర్తయింది. గ్రామీణ జిల్లాలతో పోలిస్తే ఎకువ ఓటర్లున్న నగర, ఐటీ కారిడార్ పరిధిలోని జిల్లాల్లో ఈఎఫ్‌ల డిజిటలైజేషన్ మెల్లగా సాగుతున్నది.

# ఎమ్మెస్సీ అడ్వాన్స్ ఇంక్రిమెంట్లను వెనకకు తీసుకుంటామంటే ఆందోళన చేపడతాం

## వర్శిటీ పరిశోధన సంచాలకులకు నోటీసులు అందజేసిన టాసా ప్రతినిధులు



వ్యవసాయ విశ్వవిద్యాలయం
వైస్ ఛాన్సలర్ ఛాంబర్ ముందు బైఠాయించిన అధ్యాపకులు



వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం బలరాం తో మాట్లాడుతున్న అధ్యాపకులు



వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం బలరాం కు నోటీసు అందచేస్తున్న టాసా ప్రధాన కార్యదర్శి డాక్టర్ సల్లా సౌజన్య

**బుద్వేల్, జూలై 20 (నమస్తే ఉదయం)**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం లో ఎమ్మెస్సీ అర్హత ఆధారంగా మంజూరైన అడ్వాన్స్ ఇంక్రిమెంట్లను ఏకపక్షంగా ఉప సంహరించడంతో పాటు రికవరీ చేపట్టడాన్ని నిరసిస్తు తెలంగాణ అగ్రికల్చరల్ సైంటీస్ట్ అసోసియేషన్ (టాసా) ఆధ్వర్యంలో సోమవారం రాజేంద్రనగర్ లో నిరసన కు దిగారు. అవసరమైతే ఈ విషయమై ఆందోళనకు వెనుకాడబోమని వర్శిటీ రిజిస్ట్రార్ కు లిఖితపూర్వకంగా రాసిన నోటీసును వర్శిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం బలరాం కు అందజేశారు. యూజీసీ సవరించిన వేతన స్కేళ్లు 2016 ప్రకారం జారీ చేసిన జీవో నెంబర్ 15 ఆధారంగా ఎమ్మెస్సీ (అగ్రికల్చర్) , ఎమ్మెస్సీ (హార్టికల్చర్) , ఎంటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) , ఎమ్మెస్సీ (హోంసైన్స్/కమ్యూనిటీ సైన్స్) , ఎమ్మెస్సీ (లైబ్రెరి సైన్స్) తదితర పీజీ అర్హతలు కలిగి అధ్యాపకులు, శాస్త్రవేత్తలుగా పనిచేస్తున్న వారికి మంజూరైన రెండు అడ్వాన్స్ ఇం క్రిమెంట్లను ఉప సంహరించడం, రికవరీ చేయడాన్ని పునఃపరిశీలించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికి విశ్వవిద్యాలయం స్పందించలేదని టాసా ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం, ఏసీఏఆర్ నుంచి విశ్వవిద్యాలయమే వివరణ కోరిందని, ఇప్పటి వరకు తుది స్పష్టీకరణ రాలేదని తెలి పారు. రాష్ట్ర ఆడిట్ శాఖ కూడా ప్రభుత్వ వివరణ తీసుకోవాలని మాత్రమే సూచించిందని, రికవరీ లేదా పే రీఫిక్సేషన్ కు ఆదేశాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. అడ్వాన్స్ ఇంక్రిమెంట్ల ఉప సంహరణ, రికవరీ నిర్ణయాల వల్ల 250 కి పైగా అధ్యాపకులు, శాస్త్రవేత్తలలు తీవ్ర మానసిక వేధనకు గురౌతున్నారన్నారు. ఆర్థికంగా కూడా నష్టపోతున్నారని టాసా ప్రతినిధులు వాపోయారు. ఈ విషయంపై పలుమార్లు వినతి పత్రాలు అందజేసినప్పటికి యాజమాన్యం ఉత్తర్వులును ఉప సంహరించుకోకపోవడంతో పాటు సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్చలు ప్రారంభించలేదని ఆరోపించారు. దీంతో తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు టాసా ప్రతినిధులు తెలిపారు. ఎమ్మెస్సీ అడ్వాన్స్ ఇంక్రిమెంట్లు రికవరీ చేస్తే 250 మందికి పైగా అద్యాపకులకు ఒక్కొక్కరివి 10 నుంచి 15 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని, నెలకు రూ.20వేల వరకు వేతనంలో కోత పడుతుందన్నారు. బీఎస్సీ అగ్రికల్చరల్ ప్రొఫెసనల్ కోర్సు అని ఐసీఏఆర్ చెబుతుందని, అలాంటప్పుడు ఎమ్మెస్సీ అగ్రికల్చర్ అనుబంధ కోర్సులు కూడా ప్రొఫెషనల్ డిగ్రీ పరిధిలోకే వస్తాయని గుర్తు చేశారు. వైస్ చాన్సలర్ చాంబర్ ముందు బైఠాయించి కొద్ది సేపు నిరసన వ్యక్తం చేశారు.

**యూజీసీ ఏరియర్స్ ఇవ్వరా?**

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2016 నుంచి 2019 వరకు అద్యాపకులకు, శాస్త్రవేత్తలకు ఇవ్వాల్సిన యూజీసీ ఏరియర్స్ వచ్చినప్పటికి 150 మంది అధ్యాపకులు, శాస్త్రవేత్తలకు ఇంకా ఇవ్వలేదని టాసా ఆరోపించింది. ఏరియర్స్ కు సంబందించిన డబ్బు వచ్చి వర్శిటీ ఖాతాలో ఉన్నప్పటికి కొందరికి ఇచ్చి తమకెందుకు ఇవ్వడం లేదని టాసా ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా వర్శిటీ వైస్ చాన్సలర్ విదేశీ టూర్ లో ఉండగా, రిజిస్ట్రార్ సెలవులో ఉన్నట్లు తెలిసింది.



# నీటిని వృధా చేస్తే పదివేల జరిమానా జలమండలి అధికారుల హెచ్చరిక..

**రాజేంద్రనగర్,జూలై20(నమస్తే ఉదయం)**

జలమండలి చేస్తున్న సరఫరా అయ్యే మంచి నీటిని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వాటర్ బోర్డ్ అధికారులు హెచ్చరించారు.బండలు కడగటం,కార్లు వాష్ చేసి నీటినిరోడ్డుపైకి వదలడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై ఐదు నుంచి పదివేల రూపాయల వరకు జరిమానా విధిస్తామని వాటర్ బోర్డ్ అత్తాపూర్ సర్కిల్ మేనేజింగ్ ఇంజనీర్ శ్రావ్య స్పష్టం చేశారు. నీటి సంరక్షణ,వాటర్ హార్వెస్టింగ్ పిట్ ల ఏర్పాటుపై స్థానిక వాటర్ బోర్డు అధికారులు సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.ఇందులో భాగంగా రాధాకృష్ణ నగర్,సోమిరెడ్డినగర్ ప్రాంతాలలో అపార్ట్మెంట్లలో, బస్తీలలో తనిఖీలు చేశారు.వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు వేగంగా అడుగంటి పోతున్నాయని, మేనేజర్ ఇంజనీర్ శ్రావ్య ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి నీటి బొట్టును రక్షించడానికి అపార్ట్మెంట్లలో, గేటెడ్ కమ్యూనిటీలలో వాటర్ హార్వెస్టింగ్ పిట్స్, ఇంజక్షన్ బోర్ వెల్స్ ను శాస్త్రీయ పద్ధతిలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.మెట్రో వాటర్ బోర్డు నుంచి సరఫరా అవుతున్న నీటిని ప్రజలు సజీనియోగం చేసుకోవాలి తప్ప దుర్వినియోగపరచరాదని అన్నారు.విలువైన నీటిని వృధా చేసే వారిపై రూపాయలు ఐదు వేల నుంచి పదివేల రూపాయల వరకు జరిమానా విధిస్తున్నట్లు హెచ్చరించారు.నీటి సంరక్షణ,దుర్వినియోగని అరికట్టడానికి తమ యంత్రాంగానికి స్థానిక ప్రజలు సహకరించాలని కోరారు.ఈ స్పెషల్ డ్రైవ్ లో సీనియర్ జేటివో మహమ్మద్ జావిద్ తదితరులు పాల్గొన్నారు.స్థానిక నాయకులు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అధికారుల వెంట నిలిచారు.



గంజాయితో పట్టుబడ్డ యువకులు

# గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్ట్

**బుద్వేల్, జూలై 20 (నమస్తే ఉదయం)**

హసన్ నగర్ లో నివాసం ఉండే సాజిద్ అనే యువకుడు నివాసం ఉండే ఇంటిపై దాడి చేసిన టాస్క్ ఫోర్స్ పోలీసులు అతని దగ్గర 8.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు తో ప్రమేయం ఉన్న యువకులను అరెస్ట్ చేశారు. టాస్క్ ఫోర్స్ పోలీసుల కథనం ప్రకారం... మహరాష్ట్ర కు చెందిన శైలేష్ ద్వారా గంజాయి ని కొనుగోలు చేస్తు స్థానికంగా ఎక్కువ మొత్తానికి విక్రయిస్తున్నట్లు పోలీసులు కనుగొన్నారు. ఈ కేసులో డైరీఫామ్ కు చెందిన మహ్మద్ ఫైజాన్, బుద్వేల్ కు చెందిన సయ్యద్ సాధిక్, అత్తాపూర్ నివాసి అలీ అహ్మద్, రియాజ్ అహ్మద్ఖన్, మహ్మద్ జాఫర్, నాగపూర్ నివాసి యూసుఫ్ బిగ్ లను అరెస్ట్ చేశారు. వాకిని అత్తాపూర్ పోలీసులకు అప్పగిం చారు. కేసు దర్యాప్తులో ఉంది.



బుద్వేల్ న్యూ గ్రీన్ సిటీ కాలనీలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

# రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 90.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు

**బుద్వేల్, జూలై 20 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ న్యూ గ్రీన్ సిటీ పరిధిలో రూ. 90.20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ శం కుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎస్ఈ నరేందర్ గౌడ్ తో పాటు కాంగ్రెస్ నాయకులు, న్యూ గ్రీన్ సిటీ కాలనీ ప్రజలు పాల్గొన్నారు. రూ.67.80 లక్షలతో న్యూ గ్రీన్ సిటీ కాలనీలో, 22.40 లక్షలతో సిగ్నేచర్ అపార్ట్మెంట్ సమీపంలో సీసీ రోడ్డును వేయడం జరుగుతుందన్నారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మౌళిక సదుపాయాల కల్పన కు పెద్ద పీట వేస్తున్నామన్నారు. అన్ని బస్తీలు, కాలనీలలో సీసీ రోడ్లు, మంచినీటి సౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, వీధి దీపాల ఏర్పాటు చేయడం జరుగుందన్నారు. ప్రజలకు మెరుగైన మౌళిక వసతులు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. పనులు నాణ్యతగా వేసేటట్లు అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రజలు కూడా పనుల నాణ్యత పై పట్టించుకొని ఎప్పటి కప్పుడు అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పలుగుచెరువు మహేష్. రగడంపల్లి శ్రావణ్, పెండ్యాల శ్రీధర్, కాలనీ ప్రతినిధులు వి ప్రవీణ్ గౌడ్, గుంటి రాజ్ కుమార్ , శ్రీనివాస్, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.



చెరువుల ఆక్రమణపై హైడ్రాక్ కమిషనర్ రంగనాథ్ కు ఫిర్యాదు చేస్తున్న తిరుపతిరెడ్డి

# గగన్ పహాడ్‌లో చెరువుల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

## హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను కోరిన శీలం తిరుపతిరెడ్డి

**రాజేంద్రనగర్,జులై20(నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో చెరువులు,కుంటలు,ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నాయకులు శీలం తిరుపతి రెడ్డి అన్నారు.స్థానికంగా చెరువులు,కుంటలు కబ్జాలు చేసి నిర్మాణాలు చేపడితే రాబోయే విపత్తులను ఎవరూ నిలువరించలేరని వ్యాఖ్యానించారు.రాజేంద్రనగర్ పరిధిలోని గగన్ పహాడ్ పరిధిలోని ప్రెస్టీజ్ ప్రాంతం పెద్ద చెరువు(98.50 ఎకరాలు) ,మామిడికుంట చెరువు (19.50 ఎకరాలు) ,అప్పా చెరువు (40 ఎకరాలు) ,బ్రాహ్మణ చెరువులలో జరుగుతున్న ఆక్రమణలు,అక్రమ నిర్మాణాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని సోమవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను శీలం తిరుపతిరెడ్డి కోరారు.ఈ మేరకు హైడ్రా కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా చెరువు అన్యాక్రంతం అవుతున్న విధానాన్ని కమిషనర్‌కు వివరించారు.అనంతరం శీలం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ..హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ను కలిసి గగన్‌పహాడ్ పరిధిలోని ప్రెస్టీజ్ ప్రాంతంలోని పెద్ద చెరువు (98.50 ఎకరాలు) ,అలాగే గత మేలో సమర్పించిన ఫిర్యాదు నెంబర్ 2579పై ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు.సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి ఆక్రమణలను తొలగించి,చెరువులను పూర్తిస్థాయిలో పరిరక్షించేలా చర్యలు చేపట్టాలని కోరారు.హైడ్రా కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించడంతో తక్షణమే చర్యలు తీసుకుంటామని రంగనాథ్ వారికి హామీ ఇచ్చారన్నారు.

## అనుమానస్పద స్థితిలో

# ఓ సాఫ్ట్వేర్ ఉద్యోగి మృతి

**బుద్వేల్, జూలై 20 (నమస్తే ఉదయం)**



మృతి చెందిన సుధాకర్ రెడ్డి

అనుమానస్పద స్థితిలో ఓ సాఫ్ట్వేర్ ఉద్యోగి మృతి చెందాడు. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బండ్లగూడ ప్రాంతంలో ఆదివారం ఉదయం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఈ విదంగా ఉ న్నాయి.... బండ్లగూడ ప్రాంతానికి చెందిన సుధాకర్ రెడ్డి (36) సాఫ్ట్వేర్ ఉద్యోగి. భార్య పిల్లలతో కలసి ఉంటున్నాడు. గత శనివారం భార్య సన్సిటీ లో ఉండే తల్లిగారింటికి పిల్లలతో కలసి వెళ్లింది. ఇంట్లో ఒక్కడే ఉన్న సుదాకర్ రెడ్డి రాత్రి పడుకున్నాడు. ఆదివారం సుధాకర్ రెడ్డి కి ఆయన తండ్రి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో అతను స్థానికంగా ఉండే కుమారుని స్నేహితునికి ఫోన్ చేసి నా కుమారుడు సుధాకర్ రెడ్డి ఫోన్ తీయడం లేదు అని చెప్పి కొంచెం చూడవా అని కోరాడు. అతని స్నేహితుడు ఇంటికి వచ్చి తలుపుతట్టగా తీయలేదు. కిటికీలోంచి చూడగా బెడ్ పై పడి ఉ న్నాడు. విషయాన్ని సుదాకర్ రెడ్డి తండ్రికి చెప్పడంతో ఆయన రాజేం ద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సుదాకర్ రెడ్డి మరణానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

# ప్రొబెషనరీ ఐపీఎస్ అధికారి ఉదయ్ క్రిష్ణారెడ్డిపై కొనసాగుతున్న విచారణ

**బుద్వేల్, జూలై 20 (నమస్తే ఉదయం)**

శివరాంపల్లి లోని సర్దార్ వల్లభాయి పటేల్ జాతీయ పోలీస్ అకాడమీ (ఎస్ వీ పీ ఎన్ పీ ఏ) లో శిక్షణ లో ఉన్న తోటి ఐసీఎస్ ఆఫీసర్ తనను వేధిస్తున్నాడని ఓ మహిళా ప్రొబెషనరీ ఐపీఎస్ అధికారిణి అత్తాపూర్ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం తో పోలీసులు ఈ సంఘటన పై విచారణ చేపట్టారు. ఈ నెల 18న రాత్రి 11 గంటల సమయంలో మహిళా ప్రొబెషనరీ ఐపీఎస్ అధికారిణీ తోటి ప్రొబెషనరీ ఐపీఎస్ అధికారి అయిన ఉదయ్ క్రిష్ణారెడ్డి పై ఈ ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన పై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్స్పెక్టర్ ఎ సీతయ్య లు ఆదివారం సాయంత్రం ఎస్వీపీ ఎన్పీఏ ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. ఈ సంఘటన పై ఎస్వీపీ ఎన్పీఏ అధికారులు కూడా ఓ కమిటీ ని వేసి విచారిస్తున్నట్లు తెలిసింది. వారితో మాట్లాడిన రాజేంద్రనగర్ ఏసీపీ, అత్తాపూర్ ఇన్స్పెక్టర్లు సోమవారం తన విచారణ ను ప్రారంభించారు. మహిళా ప్రొబెషనరీ ఐపీఎస్ అధికారిణి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం సీన్ ఆఫ్ అఫెన్స్ ను చూస్తున్నట్లు తెలుస్తుంది. తనను రూమ్ లోకి లాక్కెళ్లి ఫోన్ పాస్వర్డ్ తీయమని బెదిరించాడని ఫిర్యాదు లో పేర్కొనడంతో దానిపై నిజా నిజాలు తెలుసుకోవడానికి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎస్ వీ పీ ఎన్ పీ ఏ లో ఉన్న వారితో ఈ విషయమై ఏమైన తెలుసా అనే కోణంలో కూడా అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య ఆరా తీస్తున్నారు.

**ఆత్మహత్య కు పాల్పడిన ఉదయ్ క్రిష్ణారెడ్డి**

మహిళా ప్రొబెషనరీ ఐపీఎస్ అధికారిణి తనను వేదిస్తున్నాడని ఫిర్యాదు చేసిన ఉదయ్ క్రిష్ణారెడ్డి ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మోతినగర్ ప్రాంతంలో సోమవారం ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడని తెలుస్తుంది. ఆయనను స్థానికంగా ఉన్న ఆసుపత్రిలో చేర్పించారని, ప్రమాదమేమి లేదని తెలిసింది. ఎస్వీపీ ఎన్పీఏ లో ఉండాల్సిన ఉదయ్ క్రిష్ణారెడ్డి బయట ఉండణంతో ఆయన పై ఎస్ వీ పీ ఎన్ పీ ఏ అధికారులు సస్పెన్షన్ లాంటి చర్యలు ఏమైన తీసుకున్నారా... తెలియాల్సి ఉంది.




వాల్ పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

# ఆగస్టు 1న ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మహా ధర్నా


**బుద్వేల్, జూలై 20 (నమస్తే ఉదయం)**

ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ఫెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 1న ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న మహా ధర్నా కు సంబందించిన వాల్ పోస్టర్ ను సోమవారం రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘ ం (తపస్) ప్రతినిధులు ఆవిష్కరించారు. రాజేంద్రనగర్ మండల విద్యాశాఖాధికారి శంకర్ రాథోడ్, రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాద్యాయులు జూపల్లి శ్రీనివాస రావు, తపస్ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి కె హనుమంతురావు లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పీఆర్సీ నివేధిక తెప్పించుకుని 51శాతం ఫిట్మెంట్ ప్రకటించాలన్నారు. పెండింగ్ లో ఉన్నటువంటి 6 డీఏ లను వెంటనే క్లియర్ చేయాలన్నారు. పెండింగ్ బిల్లులను సత్వరమే చెల్లించాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. సీపీఎస్ ను రద్దు చేసి ఓపీఎస్ ను అమలు చేయాలన్నారు. ఎస్ఎస్ఏ, కేజీబీవీ ఉ పాధ్యాయినీల 29 రోజుల సమ్మె శాలరీ చెల్లిస్తు ఎంటీఎస్ ను మంజూరు చేయాలన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దును అమలు చేయాలన్నారు. ఇలా 14 డిమాం డ్లతో కూడిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీటన్నింటిపై ఇందిరా పార్కు వద్ద జరిగే మహా ధర్నా లో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ నాయకులు ఎం బాలక్రిష్ణ, జి బాలక్రిష్ణ, శ్రీనివాస్ రెడ్డి ,విజయమ్మ. నాగరాణి లు పాల్గొన్నారు.

# నేడు కిస్మత్పూర్ సెక్షన్ల విద్యుత్ సరఫరాలలో అంతరాయం

**బండ్లగూడ, జూలై 20(నమస్తే ఉదయం)**

కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజ్ తెలిపారు. మధ్యాహ్నం 02:30 నుండి 04:30 వరకు స్నేహిత హిల్స్ సబ్-స్టేషన్ నుండి వచ్చే పి ఉ టి కాలనీ ఫీడర్‌లి పై విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. ఆదర్శ నగర్, బైరాగి గూడ, భవాని కాలనీ, బుండ్లగూడ గ్రామం, చెవెల్ల, చింతల్‌మెట్ టవర్స్, సిటి మీటర్స్,హిమాయత్‌సాగర్, డి డి కాలనీ, గండంగూడ, హిమాగిరి కాలనీ, హెచ్‌వి బండ్లగూడ, హెచ్‌వి నెట్,మీటర్స్, హెచ్‌వి పిడటి సన్ సిటీ, హైదర్షకోటే, జెఎల్ఎన్ఎస్



కాలనీ, కాలికా నగర్, కపిల్ నగర్, పిడటి కాలనీ, పిడటి కాలనీ సి-బ్లాక్, పేరం చెరు, రాధా నగర్, ఆర్ జి జి వై గృహ (పీరంచేరు) , సాయి హర్ష కాలనీ, సాయిరాం నగర్ కాలనీ, ఎస్ ఎం ఆర్ బిల్డర్స్, శ్రీనివాస్ నగర్ కాలనీ, ఎస్ టి ఎల్ , పిడబ్ల్యూఎస్ గంధంగూడ, సన్‌సిటీ, విద్యపీఠం, వికాస్ నగర్, మొదలైనవి మరియు ఉదయం 10:00 నుండి. వరకు 12:00 జూఎ. నిర్వహణ, చెట్లు నరికే పనుల నిమిత్తం, 11 కేవీ రాక్ చర్చ్ ఫీడర్ ప్రభావిత ప్రాంతాలైన శ్రీ సాయి కాలనీ, ప్రభుత్వ పాఠశాల, రాఘవేంద్ర కాలనీ, ఫైనర్స్ కాలనీ, ఎన్ఆర్ఐ టౌన్‌షిప్, రాధా రియల్టీ, వివేకానంద కాలనీ, యాదాద్రి కాలనీ, ఓం నగర్ కాలనీ, ఎస్ఎం ఎన్‌క్లేవ్ 1 ఉ 2, సిఎల్ విల్లాస్, పూజా విల్లాస్, రాక్ చర్చ్ ఉ కృతి విల్లాస్ మొదలైన వాటిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

# జయశంకర్ కాలనీ ఫేజ్-2 నూతన కమిటీ సభ్యుల సన్మానం



### కార్యక్రమంలో పాల్గొన్న పట్వారీ శశిధర్ -- కాలనీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ

**కూకట్‌పల్లి, జూలై 20 (నమస్తే ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ జయశంకర్ కాలనీ ఫేజ్-2లో నూతన కమిటీ సభ్యుల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఇటీవల కాలనీ నూతన అధ్యక్షుడిగా మహమ్మద్ రఫీక్ ఎన్నిక కావడంతో కాలనీ అభివృద్ధి లక్ష్యంగా కొత్త కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను అభినందిస్తూ ప్రత్యేక సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, డివిజన్ నాయకుడు పట్వారీ శశిధర్, రంగారెడ్డి జిల్లా డీసీసీ కార్యదర్శి సత్తూరి శిరీష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించి ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను కూడా శాలువాలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, మహమ్మద్ రఫీక్ చిన్న వయస్సులోనే కాలనీ ప్రజల విశ్వాసాన్ని, ప్రేమాభిమానాలను సంపాదించి నేడు కాలనీ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. యువ నాయకుడిగా ఆయన సేవా దృక్పథంతో కాలనీ ప్రజల సమస్యలను గుర్తించి సమర్థవంతంగా పరిష్కరించే దిశగా పనిచేయాలని ఆకాంక్షించారు. జయశంకర్ కాలనీ ఫేజ్-2లో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలు, రోడ్లు, డ్రైనేజీ వంటి ప్రజా సమస్యల పరిష్కారానికి కొత్త కమిటీ చొరవ తీసుకుని ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవాభావంతో పనిచేస్తే కాలనీ మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అలాగే కాలనీ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో సమన్వయం చేసి వీలైనంత త్వరగా పరిష్కరిం చేందుకు కృషి చేస్తామని పట్వారీ శశిధర్ హామీ ఇచ్చారు. ప్రజల అభ్యున్నతే తమ లక్ష్యమని, కాలనీ అభివృద్ధికి అవసరమైన ప్రతి విషయంలో అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. నూతన అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన కాలనీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ సభ్యులతో కలిసి ప్రతి కుటుంబ సమస్యను తెలుసుకుని, కాలనీ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. ప్రజల సహకారంతో జయశంకర్ కాలనీని ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ కాలనీ అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్, రాజమణి, కె. విజయ్ కుమార్, ఐ. అంజలి, శివరాం, ప్రభాకర్, శాంతి, శ్యామ్, వినోద్, విజయలక్ష్మి, కమిటీ సభ్యులు, కాలనీవాసులు, యువకులు, మహిళలు, టీం పట్వారీ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన కమిటీ ఏర్పాటుతో జయశంకర్ కాలనీ ఫేజ్-2లో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం అవుతాయనే ఆశాభావాన్ని స్థానికులు వ్యక్తం చేశారు.

## మురుగు కాలువగా మారిన జూరాల కుడి కాలువ

### ప్లాస్టిక్ వ్యర్థాలు, డ్రైనేజీ నీటితో కలుషితం

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 20 (నమస్తే ఉదయం)**

గద్వాల పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లోని వేలాది ఎకరాల పంట పొలాలకు సాగునీరందించే జూరాల ప్రాజెక్టు కుడి కాలువ ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రస్తుతం మురుగు కాలువను తలపిస్తోంది. ఏళ్ల తరబడి పూడికతీత పనులు, కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో కాలువ నిండా చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థపదార్థాలే దర్శనమిస్తున్నాయి. దాదాపు నాలుగు నెలలనుంచి జూరాల కుడికాలువలో సాగునీరు పారడంలేదు. ఇరిగేషన్ అధికారులు ధ్వంసమైన కాలువలను మరమ్మతులు చేయడంలేదు. కనీసపు మరమ్మతులు చేయించని దయానీయ పరిస్థితిలో ఇరిగేషన్ శాఖ అధికారులు ఉన్నారని రైతాంగం విమర్శిస్తోంది. వేసవి కాలంలోనే కాలువలోని చెత్తను తొలగించి, మరమ్మతులు చేయాలని రైతులు, పట్టణ ప్రజలు ఇరిగేషన్ అధికారులకు పదే పదే విజ్ఞప్తి చేసినా.. వారు ఏమాత్రం చర్యలు తీసుకోలేదని స్థానికులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు.



**కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాల గుట్టలు -- చేరిన డ్రైనేజీ నీరు:**

గద్వాల పట్టణ పరిధిలోని చేనుగోనిపల్లి రోడ్డు, భీంనగర్, రెవెన్యూ కాలనీ, పాత హౌసింగ్ బోర్డు, బీరోలు రోడ్డు, జమ్మిచేడు వరకు ప్రవహిస్తున్న కుడి కాలువ భాగం నిత్యం ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థ పదార్థాల పారవేతతో చెత్తకుప్పగా మారింది. మరింత ఆందోళనకరమైన విషయమేమిటంటే.. భీంనగర్, రెవెన్యూ కాలనీ, పాత హౌసింగ్ బోర్డు కాలనీల నుంచి వస్తున్న డ్రైనేజీ మురుగు నీరు నేరుగా ఈ కుడి కాలువలోనే కలుస్తోందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

**కలుషిత నీరే తాగునీరు -- రోగాల బారిన పడే ప్రమాదం:**

జమ్ములమ్మ రిజర్వాయర్ నుండి గద్వాల పట్టణ ప్రజలకు ఈ కాలువ నీటిని ఫిల్టర్ చేసి తాగునీరుగా సరఫరా చేస్తున్నారు. డ్రైనేజీ మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలతో కలుషితమైన ఈ నీటినే పట్టణ ప్రజలు తాగాల్సి వస్తుండడంతో ప్రజారోగ్యం తీవ్ర ప్రమాదంలో పడే అవకాశం ఉందని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత నీటిపారుదల శాఖ (ఇరిగేషన్) , జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, యుద్ధప్రాతిపదికన జూరాల కుడి కాలువలోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలి అని, డ్రైనేజీ నీరు కాలువలో కలవకుండా అడ్డుకట్ట వేసి, ధ్వంసమైన కాలువకు మరమ్మతులు చేపట్టి పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని, రైతుల పంటలను కాపాడాలని కోరుతున్నారు.




## నేషన్ ఫస్ట్ ఛాలెంజ్ కార్యక్రమానికి మన గద్వాల్ జిల్లా వాసి టీ రమేష్ ఎంపిక

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 20(నమస్తే ఉదయం)**

ఉత్తర్ ప్రదేశ్, లక్నోలో ఇంద్ర గాంధీ ప్రస్థాన్ భవన్ జుపిటర్ ఆడిటోరియం నిర్వహించిన కార్యక్రమానికి గద్వాల్ జిల్లా వాసి టి రమేష్ కూ చోటు దక్కింది . ఈ నెల 17న లక్నోలో జరిగే కార్యక్రమంలో కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ చేతుల మీదుగా రమేష్ ప్రశంసాపత్రాన్ని అందుకోనున్నట్లు వెల్లడించారు. ఈ నేషన్ ఫస్ట్ ఛాలెంజ్ యొక్క ముఖ్య ఉద్దేశం. దేశాన్ని రిప్రజెంటేషన్ చేసే విధంగా పదిమందికి ఆదర్శంగా ఉండేలా యూత్ ని గుర్తించి వారికి మరింత నైపుణ్యం పెంపొదించుకునేలా ప్రోత్సహించడం. రమేష్ ధరూర్ మండలం గద్వాల జిల్లా వాసి మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివే సమయంలో యన్ సి సి, ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనడం. మొక్కలు నాటే కార్యక్రమం, రక్తదాన కార్యక్రమాలు, డ్రగ్స్ మరియు ఆల్కహాలిక్ వల్ల జరిగిన నష్టాలు, స్వదేశీ వస్తువులు వాడకాలు దానివల్ల ప్రయోజనాలు మొదలగున వాటి గురించి వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు చేస్తూ. యువతకు ఆదర్శంగా నిలిచిన టి రమేష్ ను జాతీయస్థాయిలో గుర్తింపు రావడం గద్వాల జిల్లాకు గర్వకారణం .

## రోడ్లపై గుంతలను పూడ్చి మట్టితో చదును చేయించిన 3వ వార్డు కౌన్సిలర్ నాగులు యాదవ్

**గద్వాల, జూలై 20(నమస్తే ఉదయం)**




గద్వాల పట్టణంలోని 3వ వార్డులో వేణు కాలనీలో గల ప్రధాన రహదారి ఇటీవలి వర్షాల కారణంగా తీవ్రంగా దెబ్బతిని, పెద్ద పెద్ద గుంతలు మారడంతో వాహనదారుల రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. ఈ సమస్యపై 3వ వార్డు కౌన్సిలర్ నాగులు యాదవ్ తక్షణమే స్పందించారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆదేశానుసారం కాలనీ వాసుల మరియు వాహనదారుల ఇబ్బందులను స్వయంగా పరిశీలించిన 3వ వార్డు కౌన్సిలర్ నాగులు యాదవ్, వెంటనే జేసీబీ , ట్రాక్టర్ల సహాయంతో రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి, మట్టి తో రోడ్డును పూర్తిగా చదును చేయించారు. ప్రమాదకరంగా మారిన దారిని యుద్ధప్రాతిపదికన బాగు చేయించి, రాకపోకలను పునరుద్ధరించడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, కౌన్సిలర్ నాగులు యాదవ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన సౌకర్యాలు








### అడిషనల్ కమిషనర్ బి.నర్సింగ్ రావు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 20(నమస్తే ఉదయం)**

జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు నాణ్యంగా అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అదనపు కలెక్టర్ బి.నర్సింగ్ రావు ఆదేశించారు.సోమవారం మల్దకల్ మండలం బిజ్జారం (పరమాల) గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, విద్యార్థుల వసతి గృహాలు, వంటశాల,భోజనశాల,పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం,విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఆహార నాణ్యత, పారిశుధ్యం,తాగునీటి సౌకర్యాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.విద్యార్థుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించిన అదనపు కలెక్టర్, వారి విద్యాభ్యాసం,వసతి సౌకర్యాల గురించి తెలుసుకొని వారికి నోట్‌బుక్స్,బెడ్‌షీట్లు పంపిణీ చేసి,బాగా చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు, సిబ్బంది , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## ఎస్ఐఆర్' ఓటర్ల సవరణ ప్రక్రియపై కీలక సమీక్ష

### క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేసి ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించాలి

### కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి

**కూకట్ పల్లి, జూలై 20 (నమస్తే ఉదయం)**

క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేసి ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ డివిజన్‌లో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. డివిజన్‌లోని ప్రతి బూత్‌ను సందర్శించి బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) , బూత్ స్థాయి ప్రతినిధులతో (బీఎల్ఏలు) కలిసి ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ, పరిశీలనపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ) సుదర్శన్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. డివిజన్‌లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అందేలా, ఓటరు జాబితాలో ఉన్న తప్పులను సరిదిద్దేలా ప్రతి బూత్ పరిధిలో విస్తృతంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ) ప్రకారం ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ, పరిశీలనతో పాటు ఓటర్లకు అవగాహన కల్పించే కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ప్రతి అర్హుడి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. అనంతరం నాయకులతో సమావేశమై ఫారమ్‌ల పంపిణీ, సేకరణ, పరిశీలనతో పాటు ప్రజలకు అవగాహన కల్పించే అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ డివిజన్ అధ్యక్షుడు మధు గౌడ్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసన్న కుమార్, మేడ్చల్ జిల్లా ఫిషర్‌మెన్ కమిటీ వైస్ చైర్మన్, బాలానగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆకుల నరేందర్ ముదిరాజ్, రవి ముదిరాజ్, యూత్ ప్రెసిడెంట్ అర్షద్ సోను, జిల్లా శివ, పీటర్ తదితరులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి

### ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలి

### టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్

**కూకట్ పల్లి, జూలై 20 (నమస్తే ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ డివిజన్‌లో పులి శివా గౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ (సర్) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ కార్యక్రమంలో పాల్గొని నిర్వాహకులను అభినందించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ, కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజలతో నిత్యం అనుసంధానమై ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పులి శివా గౌడ్‌తో పాటు పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను బండి రమేష్ అభినందించారు. బాలానగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్ప రెడ్డి, శ్రీకాంత్ పటేల్, తూము వేణు, రామ్మోహన్, మదన్మోహన్, శ్రీకాంత్ గౌడ్, యువజన నాయకులు, మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733